# భారతదేశ చరిత్ర

## మౌర్య సామ్రాజ్యం – అశోకుడు

అశోకుడు మౌర్య సామ్రాజ్యానికి చెందిన గొప్ప చక్రవర్తి. క్రీ.పూ. 273 నుంచి క్రీ.పూ. 232 వరకు పరిపాలించాడు. ప్రఖ్యాత సాంచి, సారనాథ్ స్తూపాలను వేయించాడు. ఈయన కాలంలోనే క్రీ.పూ. 261లో కళింగ యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో మరణించిన లక్షలాది మంది సైనికులను చూసి చలించిన అశోకుడు యుద్ధాన్ని విరమించాలని నిర్ణయించుకుని రణభేరిని ధర్మభేరిగా మార్చాడు.

### ధమ్మ సిద్ధాంతం

అశోకుడు ప్రచారం చేసిన నీతి నియమాలను ధమ్మ సిద్ధాంతంగా పేర్కొంటారు. ధమ్మ ప్రాకృత పదం కాగా ధర్మ సంస్కృత పదం. ప్రజలు అనుసరించాల్సిన జీవన విధానం, ప్రవర్తనా నియమావళే ధమ్మ సిద్ధాంతం. అశోకుడు వేయించిన 11వ ప్రధాన శిలాశాసనం ధమ్మ సిద్ధాంతం అర్థాన్ని, ప్రాముఖ్యతను వివరిస్తుంది. జంతుబలులు, జాతరలను నిషేధించాలని (1వ); సామాజిక సంక్షేమం అందించాలని (2వ); బ్రాహ్మణులు, శ్రమణుల పట్ల ఉదారత చూపాలని (3వ); అహింసను పాటించాలని (4వ); సేవకులు, బందీలను మానవతా దృక్పథంతో చూడాలని (5వ) అశోకుడు ప్రధాన శిలాశాసనాల ద్వారా పేర్కొన్నాడు. ధమ్మ సిద్ధాంతాల ప్రచారం కోసం అశోకుడు ధర్మమహామాత్రులు అనే ప్రత్యేక ఉద్యోగులను నియమించినట్లు 5వ ప్రధాన శిలాశాసనం తెలియజేస్తుంది. అతడు బౌద్ధ మతాన్ని రాజ్యమతంగా చేసినప్పటికీ పరమతసహనాన్ని పాటించాడు. అన్ని మతాల పట్ల సహనాన్ని, ఆదరణను చూపాలని 7వ, 12వ ప్రధాన శిలాశాసనాల్లో ప్రస్తావించాడు. తన 12వ పాలనా సంవత్సరంలో అజీవక మతస్థులకు కొన్ని గుహలను దానం చేశాడు. అశోకుడి 'ధమ్మ' నూతన సిద్ధాంతంగా కాకుండా ఒక జీవన విధానంగా గుర్తింపు పొందింది.

### అశోకుడి ఘనత

అశోకుడు భారతదేశపు గొప్ప చక్రవర్తిగా పేరొందాడు. 'యుద్ధంలో విజయం సాధించినప్పటికీ యుద్ధాన్ని విరమించుకున్న ఏకైక చక్రవర్తి అశోకుడు' అని హెచ్.జి. వెల్స్ అనే చరిత్రకారుడు పేర్కొన్నాడు.

'రోమన్ చక్రవర్తి సీజర్ తెలుసుకుని జయించగా, అశోకుడు జయించి తెలుసుకున్నాడు' అని లారెన్స్ బనియన్ తెలిపాడు. అశోకుడు సిద్ధాంతాలను ప్రచారం చేయడమే కాకుండా స్వయంగా ఆచరించాడు. రాజ్యంలో సుపరిపాలన అందించాడు. రాజ్యమంతటా రహదారులు వేయించి, వాటికి ఇరువైపులా చెట్లు నాటించాడు. బావులు తవ్వించాడు. అశోకుడు శ్రీనగర్‌ను నిర్మించినట్లు కల్హణుడు రాసిన రాజతరంగిణి గ్రంథం పేర్కొంటుంది. అశోకుడి 'ధమ్మ' లౌకిక బౌద్ధమతం అని ఆర్.జి. భండార్కర్ తెలపగా, అది ఒక విశ్వమతమని ఆర్.ఎస్.త్రిపాఠి వ్యాఖ్యానించారు. అశోకుడి అన్వేషణ ఫలితమే ధమ్మ సిద్ధాంతం అని రోమిలా థాపర్ పేర్కొన్నారు.

అశోకుడు విదేశాలతో స్నేహపూర్వక సంబంధాలు కలిగి ఉన్నాడని చరిత్రకారులు వివరించారు. సిరియా పాలకుడు రెండో ఆంటియోకస్, ఈజిప్ట్ పాలకుడు ఫిలడెల్ఫస్, మాసిడోనియా రాజు ఏంటిగోనస్ గోనాటస్, సింహళ పాలకుడు మాగాస్ (తిస్స)లతో అశోకుడు దౌత్య సంబంధాలను నెలకొల్పాడు. బుద్ధుడికి జ్ఞానోదయం కలిగిన రావిచెట్టు శాఖను సింహళ రాజ్యానికి పంపాడని, అది ఇప్పటికీ ఉందని చరిత్రకారులు వివరించారు. కానీ భారతదేశంలోని అసలైన రావిచెట్టు (బుద్ధ గయ)ను గౌడ శశాంకుడు ధ్వంసం చేశాడు.

### చివరి మౌర్య పాలకులు

అశోకుడి మరణానంతరం మౌర్య సామ్రాజ్యం తూర్పు, పశ్చిమ భాగాలుగా విడిపోయింది. పశ్చిమ ప్రాంతాన్ని కొంతకాలం సంప్రతి, కుణాలుడు పరిపాలించగా తూర్పు ప్రాంతాన్ని దశరథుడు (అశోకుడి మనుమడు) పాలించాడు. చివరి మౌర్య వంశపాలకుడు బృహద్రథుడు. క్రీ.పూ. 184లో మంత్రిగా ఉన్న పుష్యమిత్ర శుంగుడు బృహద్రథుడిని ఓడించి పాటలీపుత్రం కేంద్రంగా శుంగ వంశాన్ని స్థాపించాడు.

### పతనానికి కారణాలు

క్రీ.పూ. 321లో చంద్రగుప్త మౌర్యుడు స్థాపించిన మౌర్య సామ్రాజ్యం అశోకుడి కాలంలో ఉన్నత స్థాయికి చేరుకుంది. ఆయన మరణం తర్వాత క్రీ.పూ. 184 నాటికి సామ్రాజ్యం పతనమైంది. అశోకుడే మౌర్య సామ్రాజ్య పతనానికి ప్రధాన కారకుడని ఆధునిక

చరిత్రకారుల వాదన. అశోకుడు రణభేరిని ధర్మభేరిగా మార్చడంతోనే మౌర్యసామ్రాజ్య పతనం ప్రారంభమైంది. అనంతరం వచ్చిన వారసులు బలహీనులు కావడం, సామ్రాజ్యాన్ని రెండు భాగాలుగా విభజించి పాలించడం, ధర్మ మహామాత్రుల అధికార దుర్వినియోగం, బ్రాహ్మణ వ్యతిరేకత లాంటి కారణాల వల్ల మౌర్య సామ్రాజ్యం పతనమైంది.

### బౌద్ధమత సేవ

కళింగ యుద్ధానంతరం అశోకుడు ఉపగుప్తుడి సలహాతో బౌద్ధమతాన్ని స్వీకరించాడు. అశోకుడు బౌద్ధమతాన్ని స్వీకరించినట్లు బబ్రూ శాసనం పేర్కొంటుంది. బౌద్ధమత ప్రచారం కోసం తన కుమారుడు మహేంద్రుడు, కుమార్తె సంఘమిత్రలను సింహళం (శ్రీలంక)కు పంపాడు. సోన, ఉత్తర అనే వారిని బర్మాకు పంపి, అక్కడ బౌద్ధమతాన్ని ప్రచారం చేయించాడు. క్రీ.పూ. 250లో అశోకుడు పాటలీపుత్రంలో మొగలిపుత తిస్స అధ్యక్షతన మూడో బౌద్ధ సంగీతిని నిర్వహించాడు. ఈ సంగీతిలోనే అభిదమ్మ పీటకాన్ని సంకలనం చేశారు. అశోకుడు సాంచి, సారనాథ్ స్తూపాలు వేయించాడు. తన పాలనాకాలంలో దేశమంతటా 84 వేల బౌద్ధ స్తూపాలు, 14 ప్రధాన శిలాశాసనాలు, 7 చిన్న రాతి స్తంభ శాసనాలను వేయించాడు. అశోకుడి సారనాథ్ (ఉత్తర్‌ప్రదేశ్) రాతి స్తంభం నుంచే భారత జాతీయ చిహ్నమైన సింహతలాటాన్ని స్వీకరించారు.

## మాదిరి ప్రశ్నలు

**1.** మౌర్య సామ్రాజ్య స్థాపనలో చంద్రగుప్త మౌర్యుడికి సహాయపడినవారు?

1) కౌటిల్యుడు 2) బృహద్రథుడు 3) సెల్యూకస్ నికేటర్ 4) ఎవరూ కాదు

**2.** మౌర్య వంశ చివరి రాజు?

1) కుణాలుడు 2) జలౌకుడు 3) దశరథుడు 4) బృహద్రథుడు

**3.** అశోకుడి పేరును తెలియజేసే శాసనం?

1) మస్కి 2) బబ్రూ 3) 13వ శిలాశాసనం 4) 5వ శిలాశాసనం

**4.** అశోకుడి శాసనాల్లోని బ్రాహ్మీ లిపికి అర్థం చెప్పినవారు?

1) జేమ్స్ అగస్టస్ 2) సర్‌జాన్ మార్షల్ 3) జేమ్స్ ప్రిన్సెప్ 4) చార్లెస్ గ్రాంట్

**5.** మూడో బౌద్ధ సంగీతికి అధ్యక్షుడు?

1) మొగలిపుత తిస్స 2) మహాకస్యప 3) సబకామి 4) వసుమిత్రుడు

**సమాధానాలు:** 1-1; 2-4; 3-1; 4-3; 5-1.

**రచయిత: బొత్స నాగరాజు**